ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
గురువారం 6 మార్చి 2025

నేడు మద్యం దుకాణాలకు లాటరీ

శ్రీకాకుళంక్రైం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): నూతన మద్యం పాలసీలో భాగంగా జిల్లాలో గీత కార్మికులకు 18 మద్యం దుకాణాల కేటాయింపునకు గురువారం లాటరీ తీయనున్నట్లు జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి సీహెచ్ తిరుపతి నాయుడు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 18 దుకాణాల్లో శ్రీశయనలకు-10, యాత-1, గౌడ-1, సెగిడి-4, సొండిలకు-2 షాపుల కేటాయింపునకు దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 203 దరఖాస్తులు వచ్చాయి. గురువారం ఉదయం 10గంటలకు శ్రీకాకుళంలోని అంబేడ్కర్ ఆడిటోరియంలో లాటరీ ద్వారా వారికి దుకాణాలు కేటాయించనున్నట్లు తెలిపారు.

కష్టాల చదువులు!



- గిరిజన బిడ్డలు కిలోమీటర్లు నడవాల్సిందే
- విలీనం పేరిట పాఠశాలల మూత
- గత వైసీపీ ప్రభుత్వ తీరుతో ఇబ్బందులు
- సమస్యల పరిష్కారంపై కూటమి సర్కార్ దృష్టి
- మూతపడిన బడులు తెరిపిస్తామని భరోసా



● మెళియాపుట్టి మండలం వెంకటాపురం పంచాయతీలోని అడ్డివాడ గ్రామం కొండపై ఉంది. గతంలో ఇక్కడ ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను విలీనం పేరుతో మూసేశారు. దీంతో ఈ గ్రామంలో ఉన్న 11మంది గిరిజన విద్యార్థులు టెక్కలి మండలం నర్సింగపల్లి పాఠశాలకు వెళ్లి చదువుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. రోజూ మూడు కిలోమీటర్లు కొండలు దిగి, మరో రెండు కిలోమీటర్లు పల్లం ప్రాంతంలో నడిచి నర్సింగపల్లిలో పాఠశాలకు చేరుకుంటున్నామని విద్యార్థులు పేర్కొంటున్నారు.

మెళియాపుట్టి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఆంగ్ల విద్య పేరుతో గత వైసీపీ ప్రభుత్వం గిరిజన గ్రామాల్లో పలు పాఠశాలలను విలీనం చేయడంతో విద్యార్థులు చదువుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. సీతంపేట ఐటీడీఏ పరిధిలోని 105 జీపీఎస్ పాఠశాలలు ఉండేవి. విద్యార్థులు తక్కువగా ఉన్నారనే ఉద్దేశంతో సుమారు 30 పాఠశాలలను విలీనం చేశారు. దీంతో కొంతమంది విద్యార్థులు సమీప దూరంలో ఉన్న పాఠశాలలకు వెళ్లలేక చదువుకు దూరమయ్యారు. మరికొంతమంది విద్యార్థులను రోజూ పాఠశాలకు తీసుకెళ్లి తెచ్చేందుకు తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారు. కాగా గతంలో మూతపడిన పాఠశాలలను వచ్చే విద్యా సంవత్సరం నుంచి తెరిపిస్తామని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రకటించారు. దీంతో గిరిజనులు సంతోష పడుతున్నారు.

ఉన్నవి వదిలేశారు

వైసీపీ ప్రభుత్వం 'నాడు-నేడు' పథకం కింద కొన్ని జిల్లాపరిషత్, మండల పరిషత్ పాఠశాలలకు రెండు విడతలుగా నిధులు వెచ్చించి.. అభివృద్ధి పనులు చేపట్టింది. మూడో విడత కింద జీపీఎస్ పాఠశాలకు నిధులు మంజూరు చేస్తామని చెప్పింది. కానీ పైసా కూడా నిధులు ఇవ్వలేదు. దీంతో చాలా పాఠశాలల్లో పెచ్చులూడుతున్న శ్లాబ్, అధ్వానంగా గచ్చులు దర్శనమిస్తున్నాయి.

● మెళియాపుట్టి మండలం అడ్డివాడ గ్రామంలో నిధులు మంజూరు చేసినా పదేళ్ల నుంచి పాఠశాల భవనం పూర్తికావడం లేదు. ఇంతలో విలీనం పేరుతో పాఠశాలను ఇతర గ్రామానికి తరలించడంతో నిర్మాణ పనులు అర్ధాంతరంగా వదిలేశారు. ప్రస్తుతం మొండిగోడలే దర్శనమిస్తున్నాయి.

● చందనగిరిలో పాఠశాల లేక గతంలో ఒక స్వచ్ఛంద సంస్థ నిర్మించిన భవనంలోనే చదువులు సాగిస్తున్నారు. అలాగే కేరాశింగి పాఠశాలలో గచ్చులు పెచ్చులూడి గుంతలుగా ఏర్పడింది. నేలపైనే విద్యార్థులు కూర్చొని చదువులు సాగిస్తున్నారు.

● మరికొన్ని పాఠశాలల భవనాలు శిథిలావస్థకు చేరుకోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం గిరిజన పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించింది. నిధులు మంజూరుకు చర్యలు చేపడుతోంది. గత ప్రభుత్వ హయాంలో మూతపడిన పాఠశాలలను సైతం తెరిపిస్తామని (మిగతా 6వ పేజీలో..)

● మెళియాపుట్టి మండలం చీపురుపల్లి పంచాయతీ దాసు పురంలోని ప్రభుత్వ పాఠశా లలో 14 మంది విద్యార్థులు ఉన్నారు. ఇది ఆఫ్‌షోర్ రిజర్వాయర్ నిర్వాసిత గ్రామం. ఏడేళ్ల కిందట ఈ గ్రామానికి మూడు కిలోమీటర్ల దూరంలోని నిర్వాసిత కాలనీలో ఇళ్లు నిర్మించారు. కానీ పాఠశాల నిర్మించలేదు. దీంతో పాత గ్రామంలోనే పాఠశాల కొనసాగుతోంది. రోజూ మూడు కిలోమీటర్లు నడిచి.. గెడ్డలు, వాగులు దాటుకుని పాఠశాలకు వెళ్లాల్సి వస్తోందని విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు.

● మెళియాపుట్టి మండలం దబ్బగుడ్డి గ్రామంలో సుమారు 8 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ గ్రామంలో పాఠశాల లేక పోవడంతో ప్రతిరోజూ మూడు కిలోమీటర్లు నడిచి పెద్దకేదారి పాఠశాలకు వెళ్లి విద్యార్థులు చదువుకుంటున్నారు. గ్రామానికి సరైన రహదారి లేక ఇబ్బందులు పడుతున్నారు.



రెగ్యులర్ ఏడుగురే

- కాంట్రాక్ట్ అధ్యాపకులు 87మంది
- అంబేడ్కర్ వర్సిటీలో ఇదీ పరిస్థితి
- కొన్నేళ్లుగా జరగని నియామకాలు
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు



ఎచ్చెర్లలోని అంబేడ్కర్ యూనివర్సిటీని అధ్యాపకుల కొరత వేధిస్తోంది. వర్సిటీ ఏర్పాటై 17 ఏళ్లు అవుతున్నా ఇప్పటికీ రెగ్యులర్ అధ్యాపకులు పూర్తిస్థాయిలో లేరు. కేవలం ఏడుగురు మాత్రమే ఉండడంతో బోధనకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కాంట్రాక్ట్ అధ్యాపకులతోనే తరగతులను నెట్టుకొస్తున్నారు. ప్రతీసారి పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు జారీ చేయడం.. తరువాత వివిధ కారణాలతో ఆ ప్రక్రియ ఆగిపోవడం పరిపాటిగా మారింది. కూటమి ప్రభుత్వంలోనైనా నియామకాలు జరుగుతాయని ఉన్నత విద్యావంతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఎచ్చెర్ల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న ఎచ్చెర్లలోని పీజీ సెంటర్ సుమారు 17 ఏళ్ల కిందట యూనివర్సిటీగా రూపాంతరం చెందింది. 2008లో ఇక్కడి పీజీ సెంటర్‌ను యూనివర్సిటీగా అప్పటి ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేసింది. వర్సిటీ ఏర్పాటైన తర్వాత నూతన భవనాలు, మౌలిక వసతుల కల్పనలో కాస్త మెరుగ్గానే ఉన్నా, అధ్యాపకుల కొరతను మాత్రం తీవ్రంగా ఎదుర్కొంటోంది. అంబేడ్కర్ వర్సిటీ ఏర్పాటైన తర్వాత తొలిసారిగా 2010లో శాశ్వత ప్రాతిపదికన బోధనా సిబ్బంది నియామకాలు జరిగాయి. అప్పటి వీసీ ప్రొఫెసర్ ఎస్వీ సుధాకర్ హయాంలో సోషల్‌వర్క్, బయోటెక్నాలజీ కొత్త కోర్సులను ప్రారంభించి, ఒక అసోసియేట్, ఆరు అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను నియమించారు. పీజీ సెంటర్‌గా ఉన్నప్పుడు పనిచేసిన అధ్యాపకుల్లో సుమారు 30 మంది ఆప్షన్ ఇచ్చి తిరిగి ఏయూకు వెళ్లిపోయారు. ఐదుగురు ఆచార్యులు మాత్రమే ఇక్కడ కొనసాగారు. వీరిలో నలుగురు పదవీ విరమణ చేశారు. ప్రస్తుతం వర్సిటీలో ఎకనామిక్స్‌లో ఒక ప్రొఫెసర్, బయోటెక్నాలజీలో ఒక ప్రొఫెసర్, ముగ్గురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు, సోషల్‌వర్క్‌లో ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉన్నారు. ఉన్న వారిలో రెగ్యులర్ అధ్యాపకులు ఏడుగురు మాత్రమే ఉన్నారు.

పలుమార్లు నోటిఫికేషన్ జారీ చేసినా..

అంబేడ్కర్ వర్సిటీకి వీసీలుగా పనిచేసిన ప్రొఫెసర్ హనుమంతు లజపతిరాయ్, ప్రొఫెసర్ కూన రాంజీ హయాంలో పలు మార్లు బోధనా సిబ్బంది నియామకానికి నోటిఫికేషన్లు విడుదలైనా పలు అభ్యంతరాల కారణంగా నియామక ప్రక్రియ పూర్తి కాలేదు. సుమారు (మిగతా 6వ పేజీలో..)

గ్రావెల్ మాఫియా

- కొండలు, గుట్టలు మాయం
- డీపట్టా భూములు కూడా వదలట్లే
- యంత్రాలతో యథేచ్ఛగా తవ్వకాలు
- చోద్యం చూస్తున్న అధికారులు



హరిపురం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మందస మండలంలో గ్రావెల్ మాఫియాకు అడ్డూఅదుపు లేకుండా పోతుంది. వారి దెబ్బకు కొండలు, గుట్టలు మాయమవుతున్నాయి. డీపట్టా భూములను కూడా వదలడం లేదు. ఇష్టారాజ్యంగా గ్రావెల్ తవ్వకాలు చేపట్టి తరలించుకుతున్నారు. తమ కళ్లముందే, అనుమతులు లేకుండా గ్రావెల్ రవాణా జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. కొందరు అధికారులకు నెలవారీ డబ్బులు అందుతున్నట్లు తెలుస్తోంది. మాఫియాకు కొందరు స్థానిక నాయకుల అండదండలు కూడా ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

ఎక్కడెక్కడంటే..

మండలంలోని లోహరిబంద పంచాయతీ యశోదనగర్, పిడిమందసలోని బలోక గిరి, బహాడపల్లి, రాయికోల వద్ద కొండలను యంత్రాలతో తవ్వి గ్రావెల్‌ను అక్రమంగా రవాణా చేస్తున్నారు. బీఎస్‌పురం, టంగరపుట్టి, కొండలోగాం, గంద్రుగాం, ఉమాగిరి, గుడ్డిపద్ర, కంటికోట, అల్లిమెరక వద్ద ఉన్న ప్రభుత్వ భూములతో పాటు డీపట్టా భూముల్లో కంకర తవ్వకాలు జరుగుతున్నాయి. దీంతో ఆయా ప్రాంతాలు చెరువులను తలపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం రాకతో గ్రామాల్లో సిమెంటు, బీటీ రోడ్ల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. అలాగే, స్థిరాస్థి వ్యాపారాలు ఊపందుకున్నాయి. దీంతో గ్రావెల్ వినియోగం పెరగడంతో అక్రమార్కుల కన్ను కొండలు, గుట్టలపై పడింది. గుడిపద్ర, బహాడపల్లి గంద్రుగాం సమీపంలోని కొండల నుంచి వందలాది ట్రాక్టర్లు, టిప్పర్లతో కంకర రవాణా చేస్తూ భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. పలాస, సోంపేట వంటి పట్టణాలతో తీర ప్రాంతాలకు నిత్యం గ్రావెల్ తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

● ఇది మందస మండలం కుంటికోట సమీపంలోని కొండ దుస్థితి. జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ఈ కొండపై యంత్రాలతో నిత్యం గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నాయి. స్థానిక నేత సహకారంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. ఒక్కో వాహనానికి ఒక ధరను నిర్ణయించి అక్రమంగా గ్రావెల్ రవాణా చేస్తున్నారు. ఈ కొండపై రైల్వేకు చెందిన భారీ విద్యుత్తు లైన్ల స్తంభాలు ఉన్నా పట్టించుకోవడం లేదు.



పరిశీలించి చర్యలు..

గ్రావెల్‌ను అక్రమంగా తవ్వినా, తరలించినా నేరమే. రవాణా చేస్తూ పట్టుబడిన ట్రాక్టర్ల యజమానులపై చర్యలు తీసుకుంటాం. అపరాధ రుసుం వసూలు చేస్తున్నాం. కేసులు నమోదు చేసి పోలీసులకు అప్పగిస్తాం. బహాడపల్లి కొండ అక్రమాలపై ఇప్పటికే చర్యలు ప్రారంభించాం.

-విజయలక్ష్మి, ఏడీ, గనుల శాఖ, టెక్కలి.

● మందస మండలం గుడ్డిపద్ర వద్ద ప్రభుత్వం నిరుపేదలకు ఇచ్చిన డీపట్టా భూములు ఇవి. పంటలను సాగు చేయాల్సిన ఈ భూముల్లో అక్రమార్కులు యంత్రాలతో గ్రావెల్ తవ్వకాలు చేపడుతూ జేబులు నింపుకొంటున్నారు. ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేపట్టడంతో ఆ భూములు చెరువుల్లా మారుతున్నాయి.

'కళాప్రవీణ' చిట్టిబాబు ఇకలేరు

- సంగీతరంగం మూగబోయింది
- ఎందరో గాయకులను తయారు చేసిన 'బండారు'

7లో



అదనపు వసూళ్లు చేస్తే గ్యాస్ ఏజెన్సీలు రద్దు చేస్తాం

- జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్
- పొందూరులో తనిఖీలు



గ్యాస్ గోడౌన్‌లో స్టాకు వివరాలు పరిశీలిస్తున్న జేసీ

పొందూరు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): గ్యాస్ వినియోగదారుల నుంచి ఒక్కరూపాయి అదనంగా వసూలు చేసినా సంబంధిత ఏజెన్సీని రద్దు చేస్తామని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ హెచ్చరించారు. పొందూరులోని ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ కార్యాలయం, గోడౌన్‌లను బుధవారం ఆయన తనిఖీ చేశారు. గ్యాస్ బిల్లు కంటే అదనంగా వసూలు చేస్తున్నారంటూ పొందూరు పట్టణానికి చెందిన కొందరు మహిళలు ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు డీఎస్‌వో జి.సూర్యప్రకాశ్, తహ సీల్దార్ ఆర్.వెంకటేష్ విచారణ చేపట్టి నివేదికను ఉన్నతాధికారులకు అందించారు. అక్రమ వసూళ్లు వాస్తవేనని తేలడంతో ఆ గ్యాస్ ఏజెన్సీ బాధ్యతను రణస్థలం ఏజెన్సీకి అప్పగించారు. ఈ నేపథ్యంలో బుధవారం జేసీ పొందూరులోని ఇండేన్ గ్యాస్ గోడౌన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి స్టాక్ వివరాలను పరిశీలించారు. డెలివరీ సిబ్బంది, ఏజెన్సీ నిర్వాహకులతో మాట్లాడారు. డెలివరీ సిబ్బందికి, సరైన జీతాలు ఎందుకివ్వడం లేదంటూ ప్రశ్నించారు. డెలివరీ సిబ్బంది అదనంగా ఒక్క రూపాయి వసూలు చేసినా ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. మరోసారి వినియోగదారుల నుంచి ఫిర్యాదు వస్తే వెంటనే ఏజెన్సీ రద్దుచేయాలని డీఎస్‌వోను ఆదేశించారు. కాగా, పొందూరులోని ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ బాధ్యతను రణస్థలం ఏజెన్సీకి అప్పగించిన ఒక్కరోజులోనే జేసీ వచ్చి ఏజెన్సీ బాధ్యతను మళ్లీ పాత నిర్వాహకులకే అప్పగించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అదనపు వసూళ్లు వాస్తవమని తేలినా ఆ ఏజెన్సీపై అధికారులకు ఎందుకంత ప్రేమని పలువురు వినియోగదారులు ప్రశ్నిస్తున్నారు. ఫిర్యాదు చేయడం వల్ల ఏం లాభమని ప్రశ్నిస్తున్నారు.

పలాస కాశీబుగ్గ మున్సిపాల్టీలో అక్రమాలు

- విచారణకు ఆదేశించిన ప్రభుత్వం

శ్రీకాకుళం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): పలాస కాశీబుగ్గ మున్సిపాల్టీలో అక్రమాలు చోటుచేసుకున్నాయని.. గతంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఇంజనీరింగ్ అధికారులు అవినీతికి పాల్పడినట్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు అందింది. ఈ మేరకు విచారణకు ఆదేశిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. గతంలో పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో విధులు నిర్వహించిన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.వెంకట రావు, డీఈలు కె.దక్షిణామూర్తి, ఎస్.చిరంజీవులపై విచారణకు ఆదేశిస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. అలాగే విచారణ అధికారిగా జీవీఎంసీ (విశాఖ) సూపరింటెండింగ్ ఇంజనీర్ కేవీఎస్ రవిని నియమించారు. మూడు మాసాల్లో విచారణ నిర్వహించి నివేదిక అందించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మేడలే.. పూలతోటలు

- ఇళ్లపై పూల మొక్కలు, కూరగాయల పెంపకం
- గ్రామీణ ప్రాంతాల ప్రజల ఆసక్తి


షణ్ముఖరావు ఇంటి మిద్దెపై ఉన్న డ్రాగన్ మొక్కలు


విరగబూసిన చామంతి

మెళియాపుట్టి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): పల్లెల్లోని మిద్దెలు ఉద్యానవనాలుగా మారుతున్నాయి. మిద్దె పంటలపై రైతుల్లో ఆసక్తి పెరుగుతోంది. అందం.. ఆదాయం రెండింటి సమాహారంగా ఇవి కనిపిస్తున్నాయి. ఒకప్పుడు స్థలం లేక పట్టణాల్లో తమ ఇళ్ల డాబాలపై పూలు, ఇతర మొక్కలు పెంచేవారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాలకూ ఈ తరహా మొక్కల పెంపకం విస్తరించింది. గ్రామీణులూ మిద్దెలపై మొక్కలు పెంచడానికి ఆసక్తి కనబరుస్తున్నారు. తద్వారా అభిరుచులను చాటుకోవడంతో పాటు కొంతమంది ఆదాయం కూడా చూస్తున్నారు. ఈ కోవలోకే వస్తారు మెళియాపుట్టి మండలం పెద్దమడి కాలనీకి చెందిన షణ్ముఖరావు అనే విశ్రాంత ఆర్మీ ఉద్యోగి. తన ఇంటి చుట్టే కాకుండా మేడ పైనా అందమైన పూల మొక్కలతో పాటు డ్రాగన్ ఫ్రూట్స్ సాగు చేస్తూ ఆదాయం పొందుతున్నారు. ఎక్కువగా బంతి, చామంతి, గులాబీలు నాటారు. ఐదేళ్ల నుంచి ఏటా ప్రత్యేకంగా కడియం నుంచి అందమైన పూల మొక్కలు తీసుకువచ్చి నాటుతున్నట్లు షన్ముఖరావు చెబుతున్నారు. మరికొందరు కూడా షణ్ముఖరావు బాటలో నడుస్తున్నారు.


కూరగాయల కోసం వేసిన పందిరి

వారానికి రెండుసార్లు పూలు కోస్తున్నామని... పలాస ప్రాంతానికి చెందిన పూల వ్యాపారులు వచ్చి కొనుగోలు చేస్తున్నారని ఆయన చెబుతున్నారు. దీంతో పాటు కుండీలు కట్టి... అందులో ఆర్గానిక్ ఎరువులు వాడి... డ్రాగన్ మొక్కలు నాటుతున్నారు. వాటికి ప్రత్యేకంగా తీగలతో పందిరి వేస్తున్నారు. డ్రాగన్ వల్ల మంచి ఆదాయం పొందుతున్నట్టు షణ్ముఖరావు చెబుతున్నారు.

ప్రత్యేకంగా మొక్కల అమ్మకం..

ప్రజల ఆసక్తికి తగ్గట్టు కొంతమంది పూల మొక్కల నారు వేసి... విక్రయిస్తున్నారు. బస్సు స్టాప్‌లు, సంతల్లో వీటి అమ్మకాలు ఎక్కువగా ఉంటున్నాయి. కనకాంబరాలు, గులాబీలు తదితర మొక్కలను కడియం నుంచి తెప్పిస్తున్నారు. నర్సరీలు నడిపే వ్యాపారులకు ముందుగా అడ్వాన్సులు ఇచ్చి... తమకు నచ్చిన మొక్కలను తెప్పిస్తున్నారు. వాటిని మిద్దెలపై నాటుతున్నారు.

మొక్కలకే ప్రాధాన్యం

మిద్దె పంటలపై ఉద్యోగులు ఎక్కువగా ఆసక్తి కనబరుస్తున్నారు. కుటుంబానికి కావలసిన కూరలతో పాటు పండ్ల మొక్కలు కూడా నాటుతున్నారు. ఆర్గానిక్ పద్ధతిలో వీటిని సాగు చేస్తుండడం గమనార్హం.

ఆనందం.. ఆదాయం



ఖాళీ సమయాన్ని మొక్కల పెంపకానికి కేటాయిస్తున్నాను. దీని వల్ల శరీరానికి వ్యాయామంతో పాటు ఇంటికి అందం.. ఆదాయం వస్తున్నాయి.

-షణ్ముఖరావు, పెద్దమడి కాలనీ, మెళియాపుట్టి

చెట్టు కొంచెం... పూత ఘనం



సరుబుజ్జిలి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): నందికొండ గ్రామంలోని బొడ్డేపల్లి తవిటమ్మ ఇంటి ఆవరణలో ఉన్న చిన్నమామిడి చెట్టు ఇది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది విరగబూసింది. మంచు... గాలుల ప్రభావం లేకపోతే పూత నిలిచి... దిగుబడి కూడా బాగుంటుందని స్థానిక రైతులు చెబుతున్నారు. ఇదే కాకుండా ఈ ఏడాది ప్రతి చోటా మామిడి చెట్లకు పూత ఆశాజనకంగానే ఉంటోంది. వాతావరణం అనుకూలిస్తే రైతు పంట పండినట్టేనని అంటున్నారు.

టార్గెట్ 2026

- పలాస రైల్వేస్టేషన్ ఆధునికీకరణకు సన్నాహాలు


పలాస రైల్వే స్టేషన్ ప్రధాన కేంద్రం ఊహా చిత్రం..

పలాస, మార్చి 5 (ఆంధ్రజ్యోతి)

పలాస రైల్వే స్టేషన్ త్వరలో కొత్త రూపు సంతరించుకోనుంది. సరికొత్తగా దర్శనమివ్వబోతోంది. అన్నీ అనుకున్నట్టు పూర్తయితే వచ్చే రెండేళ్లలో దీని రూపురేఖలు మారిపోతాయి. పలాస రైల్వే స్టేషన్‌ను అమృత భారత్ రైల్వే స్టేషన్‌గా అభివృద్ధి చేయడానికి రైల్వే శాఖ నిధులు కేటాయించిన విషయం విదితమే. ఆ మేరకు రెండేళ్ల కిందటే రూ.24.80 కోట్లు మంజూరు చేశారు. గత ప్రభుత్వ హయాంలో పనులు కదలలేదు. కొత్తగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పనుల్లో పురోగతి కనిపిస్తోంది. కొద్దిరోజుల క్రితం ఈస్ట్‌కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్వాల్ పలాస రైల్వే అభివృద్ధి పనులు పర్యవేక్షించడానికి వచ్చినప్పుడు ప్రత్యేకంగా అమృత భారత్ రైల్వే స్టేషన్‌గా చేస్తున్న అభివృద్ధిపై ఆయన ప్రశ్నించారు. దీంతో ఖుర్దా రోడ్ డివిజన్ అధికారులు కూడా సంబంధిత అభివృద్ధి మ్యాప్‌లు, స్టేషన్ ఆధునికీకరణ, కొత్తగా ఒకటో నెంబరు ప్లాట్‌ఫారం మార్పిడి, పార్కింగ్ టెర్మినల్, ప్లాట్‌ఫారంలో ఎస్కలేటర్ల ఆవశ్యకతను వివరిస్తూ మ్యాప్‌ను ఆయన ముందు ఉంచారు. దీనిపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. పనులు వేగవంతం చేయాలని, 2026 డిసెంబరు నాటికి పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో పనులు చురుకుగా సాగుతున్నాయి. ప్రస్తుతం ఉన్న 1, 2, 3 ప్లాట్‌ఫారాలను ఆధునికీకరిస్తున్నారు.


ఒకటో నెంబరు ప్లాట్‌ఫారంగా మారనున్న శిథిల గోదాముల సముదాయం..

మార్పులకు చర్యలు..

ప్లాట్‌ఫారంపై రూఫింగ్ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఒకటో నెంబరు ప్లాట్‌ఫారాన్ని టిక్కెట్ కౌంటర్ వైపు మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. రైల్వే స్టేషన్ వద్ద ప్రస్తుతం ఉన్న వివిధ నిర్మాణాలను పూర్తిగా నేలమట్టం చేసి... ఆ ప్రాంతంలో పార్కింగ్‌కు చర్యలు తీసుకుంటున్నారు. టిక్కెట్ కార్యాలయం ప్రాంతంలో ఉన్న వివిధ రైల్వే ప్రధాన కార్యాలయాలన్నీ పూర్తిగా తొలగించి విశ్రాంత మందిరం వైపు నిర్మించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. దీంతో పాటుగా కొత్తగా మరో ఫుడ్‌బ్రిడ్జి నిర్మించేందుకు చర్యలు చేపట్టారు. మొత్తం పనులన్నీ రెండేళ్లలో చేపట్టడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. రైల్వే స్టేషన్‌కు వెళ్లే ప్రధాన రహదారిని ఇప్పటికే రెండు లైన్ల రోడ్డుగా విస్తరించారు. దీన్ని ప్రజల అవసరాల దృష్ట్యా నాలుగులైన్ల రహదారిగా విస్తరించడానికి రోడ్ మ్యాప్ సిద్ధమైంది. మొత్తం పనులన్నీ పూర్తయితే ఈస్ట్‌కోస్ట్ రైల్వే ఖుర్దా డివిజన్‌లో ప్రధాన రైల్వే స్టేషన్‌గా పలాస మారుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.


ఏడేళ్లుగా నిలిచిపోయిన అడ్డివాడ పాఠశాల భవనం

కష్టాల చదువులు!

(ఐదో పేజీ తరువాయి)

మంత్రి నారా లోకేశ్ ప్రకటించారు. ఈ మేరకు ఐటీడీఏ పరిధిలో ఏడు పాఠశాలలకు పూర్తిగా భవనాలు లేనట్టు గుర్తించామని పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి ఇటీవల వెల్లడించారు. నిధులు మంజూరైతే త్వరలో వాటి నిర్మాణాలు చేపడతామని తెలిపారు. మూతపడిన మరో 13 పాఠశాలలను వచ్చే ఏడాది నుంచి తెరిచే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

నివేదిక అందజేస్తాం..

మూతపడిన పాఠశాలలు గుర్తించి వచ్చే విద్యా సంవత్సరం నుంచి తెరిపించే ఏర్పాట్లు చేస్తాం. మూతపడిన పాఠశాలలతోపాటు ఎంతమంది విద్యార్థులు ఉన్నారో గుర్తించి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తాం.

-ప్రసాద్‌పండా, ఎంపీడీవో, మెళియాపుట్టి

ఇబ్బందులు పడుతున్నాం...

మా గ్రామంలో పాఠశాల మూతపడడంతో గత ఐదేళ్లుగా ఇబ్బందులు పడుతూనే ఉన్నాం. ప్రతిరోజూ కొండలు దిగి.. నాలుగు కిలోమీటర్లు నడిచి పాఠశాలలకు పిల్లలు వెళ్లి వస్తున్నారు.

-సవర గణేష్, అడ్డివాడ

రెగ్యులర్ ఏడుగురే

(ఐదో పేజీ తరువాయి)

49 బోధనా సిబ్బంది నియామకానికి ప్రొఫెసర్ లజపతిరాయ్ పాలనా కాలంలో రెండుసార్లు ప్రకటనలు వెల్లడైనా ఆ ప్రక్రియ మధ్యలో నిలిచిపోయింది. అలాగే వీసీ ప్రొఫెసర్ కూన రాంజీ హయాంలో సుమారు 13 అసోసియేట్ ప్రొఫెసర్లు, ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు కూడా నిర్వహించినా ఆ నియామకాలు కూడా కార్యరూపం దాల్చలేదు. 2017 ఏప్రిల్‌లో అప్పటి టీడీపీ ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలతో పాటు అంబేడ్కర్ వర్సిటీలో అధ్యాపకుల పోస్టుల భర్తీకి రాతపరీక్షలు నిర్వహించింది. కోర్టు చిక్కులు ఎదురుకావడం, ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఏకంగా ఆ నోటిఫికేషన్‌నే రద్దుచేసింది. ఆ మధ్య కాలంలో బీసీ (బ్యాక్‌లాగ్) పోస్టుల భర్తీకి అంబేడ్కర్ వర్సిటీ నోటిఫికేషన్ ఇచ్చి ఇంటర్వ్యూలు నిర్వహించినప్పటికీ అవి కూడా భర్తీకాలేదు.

వైసీపీ ప్రభుత్వ హయాంలో..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో 61 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి 2023 అక్టోబరులో నోటిఫికేషన్ ఇచ్చి దరఖాస్తులను కూడా స్వీకరించింది. కెమిస్ట్రీ, కామర్స్, ఇంగ్లీష్, లా, ఎంఎల్ఐఎస్సీ, మేథ్స్, ఎకనామిక్స్, రూరల్‌డెవలప్‌మెంటు విభాగాల్లో చెరో నాలుగు ఖాళీలు, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాల్లో చెరో 6 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చారు. అలాగే కొత్తగా ప్రారంభించిన నాలుగేళ్ల సమీకృత ఉపాధ్యాయ కార్యక్రమం (ఐటెప్)లో 12 అధ్యాపకుల పోస్టుల భర్తీకి, సోషల్‌వర్క్‌లో ఒక పోస్టు భర్తీకి ప్రకటన ఇచ్చారు. అదే విధంగా ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగానికి అసిస్టెంట్ డైరెక్టర్ పోస్టు భర్తీకి కూడా ప్రకటన జారీ అయ్యింది. అయితే కోర్టు వివాదాల కారణాలతో ఆ ప్రకటనపై స్పష్టత రాలేదు.

ఏడుగురు అధ్యాపకులే..

అంబేడ్కర్ వర్సిటీలో ఆర్ట్స్, లా, సైన్స్, ఇంజనీరింగ్ కళాశాలలను నిర్వహిస్తున్నా కేవలం ఏడుగురు మాత్రమే రెగ్యులర్ అధ్యాపకులు పనిచేస్తున్నారు. 67 మంది కాంట్రాక్ట్ అధ్యాపకులు, మరో 20 మంది వరకూ సబ్జెక్ట్ కాంట్రాక్ట్ సిబ్బందితోనే తరగతులు నెట్టుకొస్తున్నారు. యూజీసీ నిబంధనల ప్రకారం ఒక్కో కోర్సులో ఒక ప్రొఫెసర్, రెండు అసోసియేట్, నలుగురు అసిస్టెంట్ ప్రొఫెసరు పోస్టులు ఉండాలి. వాస్తవానికి ఏ కోర్సులో కూడా రెగ్యులర్ సిబ్బంది పూర్తి స్థాయిలో లేరు.

కూటమి ప్రభుత్వంపైనే ఆశలు..

కూటమి ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. దీంతో యూనివర్సిటీల్లో రెగ్యులర్ అధ్యాపకుల సిబ్బంది నియామకం జరుగుతుందనే ఆశలు చిగురించాయి. ఎప్పటి నుంచో రెగ్యులర్ అధ్యాపకుల నియామకం కోసం ఎదురుచూస్తున్న ఉన్నత విద్యావంతులు నోటిఫికేషన్ కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు.

నేటి నుంచి ఎల్లమాంబ జాతర


ఎల్లమ్మ దేవాలయం

గార, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): వమరవల్లిలో ప్రసిద్ధి చెందిన ఎల్లమ్మ జాతర గురు, శుక్రవారాల్లో వైభవంగా నిర్వహించనున్నారు. ఏటా ఇక్కడ జరిగే ఈ ఉత్సవంలో పాల్గొనడానికి ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వేలాదిగా భక్తులు తరలి వస్తారు. గురువారం రాత్రి మేళ తాళాలతో ఎల్లమ్మ తిరువీధి ఉత్సవం నిర్వహిస్తారు. శుక్రవారం ఉదయం ఎల్లమ్మ జాతర నిర్వహిస్తారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా దర్శనం కల్పించేందుకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించనున్నారు. పుట్టకు పూజలు చేయడం ఈ ఆలయం ప్రత్యేకత.


పూజలందుకుంటున్న పుట్ట


జిల్లా కేంద్రాస్పత్రిలో వేచి ఉన్న దివ్యాంగులు

సమాచార లోపం.. దివ్యాంగులకు శాపం

- ధ్రువపత్రాల పరిశీలన కోసం గంటల తరబడి నిరీక్షణ

టెక్కలి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): టెక్కలిలోని జిల్లా కేంద్రాస్పత్రికి ధ్రువపత్రాల పునః పరిశీలనకు బుధవారం పెద్ద సంఖ్యలో దివ్యాంగులు చేరుకున్నారు. ఉదయం 9 గంటలకే చాలామంది ఆస్పత్రి వద్దకు చేరుకున్నారు. గంట... రెండు గంటలు... మూడు గంటలు ఇలా... కాలం గడుస్తున్నా... ఎవరినీ ధ్రువపత్రాల పరిశీలనకు పిలవ లేదు. ఈ విషయమై కొంతమంది దివ్యాంగులు... ఆస్పత్రి అధికారులను ప్రశ్నించారు. అయితే 'ఈ రోజు పరిశీలించడం లేదు. వేరొక రోజు పరిశీలిస్తాం. మీకు సమాచారం ఇస్తామ'ని వారు చెప్పడంతో ఆశ్చర్యపోవడం దివ్యాంగుల వంతైంది. గత వారం ఇక్కడికి వచ్చినపుడు బుధవారం (5న) రావాలని చెప్పారని... తీరా ఇప్పుడు వస్తే మరో రోజు రావాలని అంటున్నారని... దివ్యాంగులమైన తమకు ఇలా పరీక్షలు పెట్టడం సబబు కాదని వారంతా నిరసన వ్యక్తం చేశారు. అయినా వైద్యులు వీటి పరిశీలనకు ముందుకు రావడంతో బుధవారం మధ్యాహ్నం వరకు పడిగాపులు కాశారు. చివరకు చేసేదేమీ లేక ఉసూరంటూ వెనుదిరిగారు. పాతపట్నం, సంతబొమ్మాళి మండలాల్లోని వివిధ గ్రామాల నుంచి 50మందికి పైగా వచ్చినట్టు దివ్యాంగులు చెప్పారు. వైద్యాధికారులు సరిగా సమాచారం ఇవ్వకపోవడంతో తాము ఇబ్బందులు పడాల్సి వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఇటు ఆకలి మంట.. అటు మండే ఎండ



శ్రీకాకుళం అర్బన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఇటు భరించలేని ఎండలు. వాటి నుంచి తప్పించుకొని ఎటైనా వెళదామని లేవబోతే...'నా బాధ చూడ కుండా ఎక్కడికి వెళతావ్?' అని ప్రశ్నిస్తున్నట్టుగా... అక్కడి నుంచి కదలనివ్వని ఆకలి... ఇదీ అరసవల్లి దేవస్థానం వద్ద బుధవారం మండుటెండలో బిచ్చగాళ్ల దుస్థితి. సమీపంలో నిలువ నీడ లేకపోవడంతో...చివరకు గొడుగుల నీడలో వీరంతా దాతల సాయం కోసం ఎదురుచూశారు.

పీజీ మూడో సెమిస్టర్ ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల, మార్చి 5(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్సిటీ అనుబంధ పీజీ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల మూడో సెమిస్టర్ పరీక్ష ఫలితాలను ఎగ్జామినేషన్ డీన్ ఎస్.ఉదయభాస్కర్ బుధవారం విడుదల చేశారు. పీజీ అన్ని కోర్సుల్లో మొత్తం 464మంది విద్యార్థులకు 349 మంది విద్యార్థులు 75.22 శాతంతో ఉత్తీర్ణత సాధించారన్నారు. పరీక్ష ఫలితాలను వర్సిటీ వెబ్‌సైట్, జ్ఞానభూమి పోర్టల్‌లో విద్యార్థులకు అందుబాటులో ఉంచారు. పరీక్ష ఫలితాలపై ఎటువంటి సందేహాలున్నా 15 రోజుల్లో పునర్ మూల్యాంకనానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

లోక్ అదాలత్ విజయవంతం చేయండి

ఇచ్ఛాపురం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు ఆవరణలో ఈ నెల 8న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ సివిల్ న్యాయాధికారి పి.పరీక్షకుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాజీపడదగిన క్రిమినల్, సివిల్ కేసులు పరిష్కరించుకునేందుకు మంచి అవకాశం అన్నారు.

బాలికలకు వ్యాస రచన పోటీలు

గార, మార్చి 5(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గార ఎస్ఐ ఆర్.జనార్దనరావు పర్యవేక్షణలో నిర్వహించిన ఈ పోటీల్లో పాఠశాల ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మలేరియా రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

● వైద్య ఆరోగ్యశాఖ రాష్ట్ర అదనపు సంచాలకులు సుబ్రహ్మణ్యేశ్వరి



మాట్లాడుతున్న ఏడీ సుబ్రహ్మణ్యేశ్వరి

అరసవల్లి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మలేరియా రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని, సీజనల్, ఇతర అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ రాష్ట్ర అదనపు సంచాలకులు (మలేరియా) డాక్టర్ వి.సుబ్రహ్మణ్యేశ్వరి, డీఎంహెచ్‌వో డాక్టర్ టీవీ బాలమురళీకృష్ణ వైద్యాధికారులకు పిలుపునిచ్చారు. పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ, ఏరియా ఆసుపత్రుల వైద్యాధికారులతో బుధవారం జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయ సమావేశ మందిరంలో సమీక్షించారు. మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, ఆటిసారం, వడదెబ్బ తదితర వ్యాధుల వ్యాప్తి, అరికట్టడానికి తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లాలో వ్యాధులు విజృంభించకుండా చూడాల్సిన బాధ్యత వైద్యాధికారులపైనే ఉందన్నారు. ఏఎన్ఎంలను చైతన్యపరచి, క్షేత్రస్థాయిలో వివిధ రకాల వ్యాధులను అరికట్టడానికి తీసుకోవాల్సిన జాగ్రత చర్యలపై ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. ఆరోగ్య యాప్‌లో అప్‌లోడ్ చేసేటప్పుడు, ప్రభుత్వానికి నివేదికలను పంపించేటప్పుడు, ఒకటికి రెండుసార్లు సరిచూసుకుని కచ్చితమైన వివరాలు పంపించాలన్నారు. వచ్చే వేసవిలో వడదెబ్బకు గురికాకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో జోనల్ మలేరియా అధికారి శాంతిప్రభ, జిల్లా మలేరియా అధికారి టీవీ సత్యనారాయణ, స్టేట్ కన్సల్టెంట్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతగానే రోడ్డు పనులు

శ్రీకాకుళం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఐటీవల పొందూరులో చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులకు సంబంధించి కొన్ని నమూనాలను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సేకరించారు. రూ.40 లక్షల వ్యయంతో చేపడుతున్న ఈ రోడ్డు పనుల నాణ్యతపై ఆగ్రహం వ్యక్తం చేసి శ్రీకాకుళంలో ఉన్న క్వాలిటీ కంట్రోల్ ల్యాబ్‌కు కొన్ని నమూనాలను పంపించారు. బుధవారం జిల్లా కేంద్రంలో పంచాయతీ రాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయ క్యాంప్ (క్వాలిటీ కంట్రోల్) ల్యాబ్‌లో స్వయంగా కలెక్టర్ శాంపిల్స్ పరీక్షిస్తున్న తీరును పరిశీలించారు. రోడ్డు నిర్మాణం నాణ్యతతోనే జరుగుతున్న ఇంజినీరింగ్ అధికారులు నిర్ధారించారు. రోడ్డు నిర్మాణంలో ఉపయోగించిన ఎం30 గ్రేడ్ కాంక్రీటు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉందని నివేదికలో వెల్లడికావడంతో కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. పల్లెపండగ పేరుతో జరుగుతున్న రోడ్ల నిర్మాణాల నాణ్యతగా చేపట్టాలని ఆదేశించారు. ఈఈ రామకృష్ణను, పంచాయతీరాజ్ ఇంజనీర్లను అభినందించారు.



ల్యాబ్‌లో శాంపిల్స్ పరిశీలిస్తున్న కలెక్టర్ పుండ్కర్

'కళాప్రవీణ' చిట్టిబాబు ఇకలేరు

● సంగీతరంగం మూగబోయింది

● ఎందరో గాయకులను తయారు చేసిన 'బండారు'



రావికొండలరావుతో..

శ్రీకాకుళం కల్చరల్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): లలిత సంగీతమే జీవిత గమ్యంగా భావించిన హార్మోనియం వాయిద్య కళాకారుడు, సిక్కోలు కళాప్రవీణగా గుర్తింపు పొందిన బండారు చిట్టిబాబు(89) బుధవారం తన స్వగృహంలో మృతి చెందారు. వివరాలిలా ఉన్నాయి.. బండారు చిట్టిబాబు 1936లో సత్యనారాయణ, వరహాలమ్మలకు ఐదో సంతానంగా జన్మించారు. సుమారు ఏడు దశాబ్దాలుగా సంగీత పయనంలో అనన్యమైన ప్రతిభతో 400 పైగా లలిత గీతాలకు స్వరకల్పన చేశారు. నాదు సంగీత రంగంలో నిష్ణాతులైన పేరయ్య శాస్త్రి, బొంపాడ రామచంద్రరావు, రామన్న వద్ద ఈయన శిష్యరికం చేశారు. 1955లో సినీనటుడు రావికొండలరావు, తిమ్మరాజు శివరావు, బంగారు క్లారినెట్ గ్రహీత సీహెచ్ నర్సింహులు సహకారంతో సుకుమార్ ఆర్కెస్ట్రాను నెలకొల్పారు. హార్మోనియంపై వాయిద్య సహకారం అందించారు. 'అంటరానివారు ఎవరు లే, ఏది హిందూ, ఏది ముస్లిం' పాటలను జాతీయ బాపల్లో కూడా స్వరపరిచారు. సత్యసాయిబాబా, రాధాకథ, విశ్వరం, సుధా బిందువులు సినిమాలకు సంగీత దర్శకత్వం వహించారు. గాయకులు బాల మురళీకృష్ణ, మహమ్మద్ రఫీ, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, జానకి, రామకృష్ణ, జి.ఆనంద్ తదితరుల సంగీత సారథ్యంలో పనిచేశారు. గానగంధర్వులు మంటపాల భగవద్గీత స్వరకల్పనకు బండారు చిట్టి బాబు సహకారం తీసుకున్నారు. అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామా రావు చేతుల మీదుగా సత్కారం పొందారు. 1974లో అప్పటి రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి చేతుల మీదుగా బంగారు పతకం అందుకున్నారు. 1983లో బాల మురళీకృష్ణ కళాప్రవీణ బిరుదు ఇచ్చి అభినందించారు. 1984లో రాష్ట్ర సంగీత నాటక అకాడమీ సభ్యుడిగా చిట్టిబాబు సేవలు అందించారు. ఈయన కుమారుడు బండారు రమణమూర్తి తబలా వాయిద్య కళాకారుడిగా రాణిస్తున్నారు. చిట్టిబాబు వేలాది మంది గాయనీ గాయకులను తయారు చేశారు. ఇప్పటికీ ఆయన శిష్యులు రాష్ట్ర వ్యాప్తంగా గాయకులుగా పేరు ప్రఖ్యాతలు సాధించారు.

రథసప్తమి నాడు ఆదిత్యుని ఏకాంతసేవ

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో ప్రతిపటా నిర్వహించే రథసప్తమి పర్వదినం సందర్భంగా రాత్రి స్వామివారి ఏకాంత సేవ నిర్వహించడం ఆనవాయితీ. ఈ ఏకాంతసేవ కీర్తనలను స్వరపరిచి వక్తి చిట్టిబాబు. సుమారు 50 ఏళ్లుగా నిర్వహిస్తున్న ఈ ఏకాంతసేవలో ప్రఖ్యాత గాయకులు జి.ఆనంద్, బీవీ నారాయణ, మండపాక శారద, డా.ఈఎస్ సంపత్‌కుమార్ తదితర గాయకులు భాగస్వాములయ్యారు.

బాలమురళీకృష్ణ చేతుల మీదుగా 'కళాప్రవీణ' బిరుదు

తిరుపతిలో నిర్వహించిన స్వర్ణోత్సవాల్లో 'కళామతల్లికి నమో నమో అంటూ' స్వరపరిచిన గీతంతో ఎంతో గుర్తింపు పొందారు. సినీ రచయితలు దేవులపల్లి ఆరుద్ర, సినారాయణరెడ్డి (సినారె), జొన్నవిత్తుల, శ్రీకాకుళం రచయిత దూసి ధర్మారావు రచించిన లలిత గీతాలను స్వరకల్పన చేస్తూ...

ప్రముఖుల నివాళి

బండారు చిట్టిబాబు మృతిపై ఆయన సహచరులు, గాయకులతో పాటు విజయనగరం సంగీత కళాశాల ప్రిన్సిపాల్ బీవీ నారాయణ, సంగీత విద్వాంసురాలు మండపాక శారద, రెడ్‌క్రాస్ ఛైర్మన్ పి.జగన్మోహన్, ఉదినిస్పందిందం అధ్యక్షుడు గుమ్మా నగేష్, సమైక్యా కళాసమితి అధ్యక్షుడు ఇప్పిలి శంకరశర్మ, నిక్కు అప్పన్న, డా.ఈఎస్ సంపత్‌కుమార్ తదితరులు నివాళులర్పించారు.



ఘంటసాలతో చిట్టిబాబు



నివాళులర్పిస్తున్న విజయనగరం సంగీత కళాశాల ప్రిన్సిపాల్ బీవీ నారాయణ

వంద పడకల ఆసుపత్రి మంజూరు చేయాలి

● అసెంబ్లీలో పాతపట్నం ఎమ్మెల్యే గోవిందరావు



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంజీఆర్

పాతపట్నం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): పాతపట్నం నియోజకవర్గానికి వంద పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి మంజూరు చేయాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కోరారు. బుధవారం అసెంబ్లీ సమావేశంలో నియోజకవర్గ సమస్యలపై మాట్లాడారు. భౌగోళికంగా విశాలమైన పాతపట్నం నియోజకవర్గంలో ప్రజలు వైద్యానికి దూరప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితులున్నాయన్నారు. దీనివల్ల వ్యయప్రయాసలకు గురవుతున్నారని, జిల్లా కేంద్రానికి మెరుగైన అత్యవసర పరిస్థితుల్లో వెళ్లాలంటే కనీసం రూ.5 వేలు వెచ్చించాల్సి వస్తోందన్నారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

రోడ్డు పనులకు మోక్షం కల్పించండి

● పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాస, మార్చి 5(ఆంధ్రజ్యోతి): అర్ధంతరంగా నిలిపివేసిన రోడ్డు పనులకు మోక్షం కల్పించాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష కోరారు. బుధవారం అసెంబ్లీలో ఆమె మాట్లాడారు. గ్రామీణ రహదారుల పనులకు 2019 వరకు ఉన్న టీడీపీ ప్రభుత్వం నిధులు విడుదల చేసిందన్నారు. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం రోడ్ల నిర్మాణాలపై ఎటువంటి నిర్ణయం తీసుకోకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిపివేశారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రహదారులకు మోక్షం కలుగుతుందని, అయితే గతంలో సగంలో ఆగిపోయిన పనులను పూర్తి చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ వ్యవహారంపై అధికారులను ప్రశ్నిస్తే గతంలో నిధులు మంజూరయ్యాయని, కొత్తగా ఇవ్వ లేమని చేతులు ఎత్తేస్తున్నారన్నారు. దీనివల్ల ప్రజల్లో వ్యతిరేక భావం కలుగుతుందని తగు నిర్ణయం తీసుకుని పనుల్లో పురోగతికి చొరవ చూపాలని కోరారు.

చేనేత కార్మికులను ఆదుకోవాలి

● ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

రణస్థలం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): వెనుకబడిన చేనేత కార్మికులను అన్ని విధాలుగా ఆదుకోవాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు కోరారు. బుధవారం అసెంబ్లీలో ఆయన మాట్లాడారు. మంగళగిరి, పొందూరు, ఉప్పాడ చేనేత వస్త్రాలు రాష్ట్ర ఖ్యాతిని ఇనుమడింపజేశాయన్నారు. కేంద్రం నేషనల్ హేండ్లూమ్ డెవలప్ ప్రోగ్రాం ద్వారా సిల్కర్లు ఏర్పాటు చేసి చేనేత కార్మికులకు శిక్షణ, నైపుణ్యం, డిజైన్లు దిశగా వాటిని పెంపొందే కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ముద్రా రుణాల ద్వారా చేనేత కార్మికులకు ఆందుకోవడం జరుగుతోందన్నారు. రాష్ట్రంలో చేనేత కార్మికుల దుర్భరమైన జీవితాన్ని అనుభవిస్తున్నారని, భర్త, భార్య కష్టపడితే పూటగడవని దుస్థితి నెలకొందన్నారు. ఉపాధి పథకం చేనేత కార్మికులను అనుసంధానం చేస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. అస్సాం రాష్ట్రంలో చేనేత కార్మికుల సంక్షేమం కోసం అక్కడ ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలపై మన ప్రభుత్వం అధ్యయనం చేస్తే బాగుంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు.

ఆదిత్యాలయ పూర్వ సీనియర్ అసిస్టెంట్‌పై విచారణ

అరసవల్లి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): గత ఏడాది ఆదిత్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసిన కృష్ణమాచార్యులు, దినసరి ఉద్యోగులను పర్మినెంట్ చేయిస్తానని, వారి నుంచి వసూళ్లకు పాల్పడిన వివయమై గతంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు విచారణ జరిగింది. ఈ విచారణ అనంతరం ఆరోపణలు ఎదుర్కొంటున్న కృష్ణమాచార్యులను విశాఖ బదిలీ కావడం, ఆ తర్వాత సస్పెన్షన్‌కు గురైన విషయం పాఠకులకు విదితమే. అయితే ఇదే విషయంపై మళ్లీ తుది విచారణ చేసేందుకు కనకమహాలక్ష్మి (విశాఖ) ఆలయ ఈవో శోభారాణి బుధవారం అరసవల్లి ఆదిత్యాలయానికి వచ్చి గతంలో ఫిర్యాదు చేసిన వారి నుంచి వివరాలు సేకరించారు. అన్నదానం, ప్రసాదాల కౌంటర్లు, ఆఫీసు సిబ్బంది, భజంత్రీల వారి నుంచి వేర్వేరుగా సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. గతంలో విచారణలో పాల్గొన్న దినసరి వేతన ఉద్యోగులను విభాగాల వారీగా పిలిపించి విచారించారు. రాతపూర్వక వారి అభిప్రాయాలు తీసుకున్నారు. గతంలో విచారణ పూర్తయిన తరువాత కూడా మళ్లీ విచారణ చేపట్టడంపై పలువురు చర్చించుకుంటున్నారు. సేకరించిన వివరాలను ఉన్నతాధికారులకు అందించనున్నట్టు విచారణాధికారి శోభారాణి స్పష్టం చేశారు.

రోడ్డు ప్రమాదంలో కార్మికుడి మృతి

రణస్థలం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై బుధవారం ఉదయం పైడిభీమవరం జంక్షన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ ప్రైవేట్ పరిశ్రమ కార్మికుడు జి.అప్పలనాయుడు (45) మృతి చెందారు. జేఆర్ పురం ఎస్ఐ ఎస్.చిరంజీవి తెలిపిన వివరాల మేరకు.. నెల్లిమర్ల మండలం తమ్మాపురం గ్రామానికి చెందిన జి.అప్పలనాయుడు స్థానిక ఏపీఐఐసీ పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తున్నారు. విధి నిర్వహణలో భాగంగా బుధవారం ఉదయం 6 గంటల ప్రాంతంలో వెళ్తుండగా అప్పలనాయుడును గుర్తుతెలియని వాహనం ఢీ కొంది. గాయపడిన అప్పలనాయుడును చికిత్స నిమిత్తం విజయనగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎస్.చిరంజీవి కేసునమోదు చేశారు.

ఇంటర్ పరీక్షల్లో 307 మంది గైర్హాజరు

గుజరాతీపేట, మార్చి 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో జరుగుతున్న ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఇంగ్లీష్-2 ఇంగ్లీషు పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 307 మంది గైర్హాజరయ్యారు. జనరల్‌లో 17,623 మందికి 17,345 మంది హాజరు కాగా, 278 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌కు సంబంధించి 1,086 మందికి 1057 మంది హాజరు కాగా 29 మంది గైర్హాజరయ్యారు. మొత్తంగా 18,709 మందికి 18,402 మంది హాజరయ్యారు. బుధవారం ఎటువంటి మాల్‌ప్రాక్టీస్ జరగలేదని అధికారులు ప్రకటించారు.

పొరపాట్లు సవరించాలి

పొందూరు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖ కార్యాలయం విడుదల చేసిన ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితాలో చోటు చేసుకున్న పొరపాట్లను, తప్పులను సవరించాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పూజారి హరిప్రసన్న, ప్రధాన కార్యదర్శి పేడాడ కృష్ణారావు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. 610 జీవో ద్వారా వివిధ జిల్లాల నుంచి వచ్చిన ఉపాధ్యాయుల పేర్లు, సీనియార్టీ ప్రకారం లేవన్నారు. 2000 డీఎస్సీలో ఎంపికై వివిధ జిల్లాల్లో నియమింపబడిన ఉపాధ్యాయులు 610 జీవో ద్వారా బదిలీ అయిన పుడు మొదట నియామకం పొందిన తేదీ కాకుండా 2007లో చేరినట్లు జాబితాలో ఉండటంతో వేలల్లో పేర్లు ఉన్నాయన్నారు. ఉపాధ్యాయుల నుంచి అభ్యంతరాలు స్వీకరించి పొరపాట్లను సవరించాలని వారు కోరారు.

ట్రిపుల్ ఐటీలో మెగాస్వచ్ఛ క్యాంప్

ఎచ్చెర్ల, మార్చి 5(ఆంధ్రజ్యోతి): స్థానిక ట్రిపుల్ ఐటీ ప్రాంగణంలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం మెగా స్వచ్ఛ క్యాంప్ నిర్వహించారు. ప్రొఫెసర్ కేవీజీడీ బాలాజీ, ఏవో ముని రామకృష్ణ పర్యవేక్షణలో క్యాంపులోని తరగతి గదుల భవన సముదాయంతో పాటు వసతి గృహం చుట్టూ ఉన్న చెత్తను తొలగించారు. డీఎస్ మోహనకృష్ణ చౌదరి, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ ముకుందరావు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనపై ప్రజల్లో సంతృప్తి: ఎంపీ కలిశెట్టి



మాట్లాడుతున్న ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

రణస్థలం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): కూటమి పాలనపై రాష్ట్ర ప్రజలు సంతృప్తిగా ఉన్నారని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. బుధవారం రాత్రి ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో అభివృద్ధి పూర్తిగా కుంటి పడిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడు నెలల్లోనే అభివృద్ధి చూసి వైసీపీ నేతలు ఓర్వలేక పోతున్నారని విమర్శించారు. మంచి పరిపాలన దక్షతైన ముఖ్యమంత్రి చంద్రబాబుపై తప్పుడు వ్యాఖ్యలు చేయడం జగన్ రెడ్డికి తగదన్నారు. టీడీపీ నాయకులు లంక శ్యామలరావు, డీజీఎం ఆనందరావు, పిసిని జగన్నాథంనాయుడు, కలిశెట్టి సూర్యనారాయణ ఉన్నారు.

పవర్‌ప్లాంట్‌ను అడ్డుకుంటే ఉద్యమిస్తాం



మాట్లాడుతున్న టీడీపీ దళిత సంఘ నాయకులు

సరుబుజ్జిలి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో సరుబుజ్జిలి, బూర్జ మండలాల సరిహద్దు ప్రాంతంలో ఏర్పాటు చేయనున్న పవర్‌ప్లాంట్‌ను అడ్డుకుంటే టీడీపీ దళిత సంఘ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని ఎస్సీ మాల కార్పొరేషన్ డైరెక్టర్ బోనెల అప్పారావు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యులు తోట రాము హెచ్చరించారు. బుధవారం సరుబుజ్జిలి మండల కేంద్రంలో నియోజకవర్గ టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు గుర్రాల చిన్నబాబు ఆధ్వర్యంలో దళిత సంఘ నాయకులు విలేకరులతో మాట్లాడారు. గత వైసీపీ పాలనలో ఐదేళ్ల బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ కార్పొరేషన్‌లో నిర్వీర్యానికి గురయ్యాయన్నారు. సరుబుజ్జిలి, బూర్జ గిరిజన గ్రామాల్లో ప్రజా సంఘాల పేరుతో కొంతమంది వ్యక్తులు పబ్బం గడుపుకుంటూ గిరిజనులను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. సరుబుజ్జిలి, ఆమదాలవలస టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షులు ఇల్లాకుల ప్రకాశ్, అప్పలసూరి పాల్గొన్నారు.

మద్దతు ధరకు గ్యారెంటీ చట్టం చేయాలి

శ్రీకాకుళం కలెక్టరేట్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అన్ని పంటలకు మద్దతు ధర గ్యారెంటీ చట్టం చేయాలని రైతు సంఘాల సమన్వయ కమిటీ కన్వీనర్ తాండ్ర ప్రకాశరావు, ఆంధ్ర రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెలమల రమణ, పోలాకి ప్రసాదరావు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ వద్ద సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో బుధవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులకు రుణమాఫీ చేయాలని, సమగ్ర పంటల బీమాను అమలు చేయాలని డిమాండ్ చేశారు. నదులను అనుసంధానం చేసి ఇచ్ఛాపురం వరకు సాగునీరు అందించేందుకు నిధులను కేటాయించాలని కోరారు. కెకొండయ్య, పి.సాంబమూర్తి, అల్లు సూర్యనారాయణ, ఎస్.కృష్ణవేణి, రాజేశ్వరరావు, రామారావు, కన్నప్పడు, ఎస్.మీనాక్షి, ఎస్.రజని, బి.నాగమణి, ఎస్.అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

నువాగడ ఆశ్రమ పాఠశాల పరిశీలన



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న పీవో

కంచిలి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): నువాగడ ఆశ్రమ పాఠశాలను సీతంపేట ఐటీడీఏ పీవో యశ్వంత్ కుమార్ రెడ్డి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి, విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యతపై ఆరా తీసి, వారితో కలిసి భోజనం చేశారు. హెచ్ఎం దుర్గాప్రసాద్ పాడి, సిబ్బంది పాల్గొన్నారు.

భవన నిర్మాణ అనుమతులు మరింత సరళం

● సుడా ఛైర్మన్ కొరికాన రవికుమార్



మాట్లాడుతున్న సుడా ఛైర్మన్ రవికుమార్

శ్రీకాకుళం అర్బన్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ అనుమతుల ప్రక్రియను మరింత సరళం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు సుడా ఛైర్మన్ కొరికాన రవికుమార్ అన్నారు. నూతన భవన నిర్మాణ అనుమతుల విధానంపై శ్రీకాకుళం పట్టణ అభివృద్ధి (సుడా) కార్యాలయంలో సుడా ఛైర్మన్ కొరికాన రవికుమార్ అధ్యక్షతన బుధవారం జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ పర్యవేక్షణలో లైసెన్స్, టెక్నికల్ పర్సన్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ రవికుమార్ మాట్లాడుతూ.. భవన నిర్మాణ అనుమతులను మరింత సులభంగా పొందేలా అవసరమైన మార్పులు చేసేందుకు ప్రతిపాదిస్తామన్నారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ పీవో, ఏపీవో, సుడా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే అసలైన అభివృద్ధి: డీఎస్పీ



మహిళా పోలీసులను అభినందిస్తున్న డీఎస్పీ తదితరులు

రణస్థలం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారతే అసలైన అభివృద్ధి అని డీఎస్పీ సీహెచ్ వివేకానంద అన్నారు. జేఆర్ పురం సీఐ ఎం.అవతారం ఆధ్వర్యంలో నాలుగు మండలాల మహిళా పోలీస్ సిబ్బందికి బుధవారం ముందస్తు మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవడమే కాకుండా మానసికంగా దృఢంగా ఉండాలన్నారు. అవకాశాలను అందిపుచ్చుకొని కుటుంబానికి అండగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు ఎస్.చిరంజీవి, సంపత్‌కుమార్, మధుసూదనరావు, ఎంపీడీవో ఎం.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఈ రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న జనరల్ మేనేజర్ శ్రీనివాస్

శ్రీకాకుళం అర్బన్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఎంఎస్ఎంఈ రుణాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని యూనియన్ బ్యాంక్ ప్రధాన కార్యాలయం జనరల్ మేనేజర్ శ్రీనివాస్ పత్రి అన్నారు. స్థానిక అంబేడ్కర్ ఆడిటోరియంలో యూనియన్ బ్యాంక్ రీజియన్ ఆధ్వర్యంలో మెగా ఎంఎస్ఎంఈ అవుట్ రీచ్ క్యాంపు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ పత్రి మాట్లాడుతూ.. ఎంఎస్ఎంఈ రుణాలు దేశ ఆర్థిక అభివృద్ధికి తోడ్పడుతున్నాయన్నారు. దేశ వ్యాప్తంగా ఈ నెల 3 నుంచి 7వ తేదీ వరకు రుణమేళా నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో నాబార్డు డీడీఎం రమేష్ కృష్ణ, జీఎం విజయరత్నం, పీయూష్ సింగ్, ఎం.వెంకట తిలక్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తంగి చెరువు కబ్జాను అడ్డుకోండి

శ్రీకాకుళం రూరల్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): కిల్లిపాలెం గ్రామంలో ఎచ్చెర్ల వీడికి ఎదురుగా సర్వే నెంబరు 178-13లో 1.18ఎకరాల విస్తీర్ణం గల తంగి చెరువు కబ్జాకు గురైందంటూ గురువారం శ్రీకాకుళం డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్‌కు ఆ గ్రామస్థులు వినతిపత్రం అందించారు. కొంతమంది చెరువును తమ పేరిట కాశీబుగ్గ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తప్పుడు పత్రాలు సృష్టించి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటామని డీటీ హామీ ఇచ్చారు.

గాయాలపాలైన వ్యక్తి.. ఆసుపత్రిలో చేర్పించిన పోలీసులు



గాయపడిన వ్యక్తి

శ్రీకాకుళం క్రైం, మార్చి 5(ఆంధ్ర జ్యోతి): నగరంలోని ఇలిసిపురం లో బుధవారం రాత్రి 10.30 గంటల సమయంలో ఓ వ్యక్తి గాయాలతో రోడ్డు మీద పడి ఉన్నాడు. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు రెండో పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో సీఐ పి.ఈశ్వరరావు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వ్యక్తిని ఆస్పత్రికి తరలించారు. రోడ్డు మీద పడి ఉన్న వ్యక్తిని చికిత్స నిమిత్తం రిమ్స్‌కి తరలించారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని సీఐ తెలిపారు.

టెండర్ నోటీసు

విషయం: ఇచ్ఛాపురం పురపాలక సంఘములో పలు పనులు గూర్చి టెండర్లు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా ఈ క్రింద విధముగా పిలువబడుచున్నవి.

1. టెండర్ నోటీసు నెంబర్ 63/2017-18/ఇ1 తేదీ 05.03.2025

మొత్తం పనుల సంఖ్య	4(15వ ఆర్థిక సంఘం మరియు సాధారణ నిధులు)
అంచనా విలువ	రూ 14.69 లక్షలు
బిడ్ డౌన్ లోడింగ్ ప్రారంభం	తేదీ 06-03-2025వ ఉదయం 11గంటలు
బిడ్ క్లోజింగ్	తేదీ 11.03.2025 వ మరియు 21-03-2025 సాయంత్రం 3 గంటలకు వరకు
బిడ్ రిసీవ్ ఆఖరు	తేదీ 11-03-2025 మరియు 21-03-2025 సాయంత్రం 4 గంటలకు వరకు
బిడ్ ప్రైస్ ఓపెనింగ్	తేదీ 11-03-2025 మరియు 21-03-2025 సాయంత్రం 5 గంటలకు వరకు

మరిన్ని వివరములకు https:www.e-procurement.gov.in నందు చూడగలరు. మరియు ఫోన్ నెంబర్ 08947 – 231176 మరియు సెల్ నెం. 9553296629

సం/- కమీషనర్, ఇచ్ఛాపురం పురపాలక సంఘము

క్రైం కార్నర్

పుస్తెలతాడు అపహరణ

కొత్తూరు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మదనాపురం గ్రామానికి చెందిన అగతముడి కళావతి మెడలో ని బంగారు పుస్తెల తాడును గుర్తు తెలియని వ్యక్తి అపహరించుకుపోయారని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎండి అమీర్ ఆలీ తెలిపారు. మంగళవారం రాత్రి ఇంటిలో నిద్రిస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తి మెడలో ఉన్న తులం పుస్తెల తాడును బల వంతంగా తెంపుకొని పారిపోయాడని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. ఈ మేరకు కేసు నమోదే చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇచ్ఛాపురం వాసికి తీవ్ర గాయాలు

భోగాపురం, మార్చి5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అమటాంరాయవలస సమీప జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇచ్ఛాపురానికి చెందిన పాండే జ్యోతేంద్రనారాయణకు తీవ్రగాయాలయ్యాయి. అయటాంరాయవలస సమీపంలో శ్రీకాకుళం నుంచి విశాఖ వైపు వెళ్లే జాతీయ రహదారిపై లారీని నిలిపి టైర్లలో గాలిని డ్రైవర్ తనిఖీ చేయిస్తున్నాడు. అదే మార్గంలో ద్విచక్రవాహనంపై పాండే జ్యోతేంద్ర నారాయణ వస్తూ ఆగి ఉన్న లారీని వెనక నుంచి బలంగా ఢీ కొన్నాడు. దీంతో ఆయన తలకు బలమైన గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108లో విజయనగరం తరలించగా పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి తగరపువలసలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతడు కోమాలో ఉన్నాడు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని సీఐ ప్రభాకర్ తెలిపారు.

2700 కిలోల పీడీఎస్ బియ్యం పట్టివేత



పట్టుబడిన పీడీఎస్ బియ్యంతో విజిలెన్స్ అధికారులు

శ్రీకాకుళం క్రైం/గార, మార్చి 5(ఆంధ్రజ్యోతి): అక్రమంగా పీడీఎస్ బియ్యం తరలిస్తే చర్యలు తప్పవని ప్రాంతీయ నిఘా అమలు అధికారి బి.ప్రసాదరావు అన్నారు. ఓ వాహనంలో తరలిస్తున్న 2700 కిలోల పీడీఎస్ బియ్యాన్ని అంపోలు జంక్షన్ వద్ద విజిలెన్స్, రెవెన్యూ అధి కారులు సంయుక్తంగా బుధవారం పట్టుకున్నారు. డ్రైవర్ పి.వినోద్‌ను విచారించగా.. నడగాం గ్రామానికి చెందిన పొట్నూరు శ్రీరామ్మూర్తి ప్రజల నుంచి సేకరించిన బియ్యాన్ని కోళ్ల ఫారాలకు సరఫరా చేస్తున్నట్టు తెలిపారు. దీంతో రూ.1,22, 850 విలువైన 2700 కిలోల బియ్యాన్ని, వాహనాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో ఆర్ఐ యు.వెంకటేష్, విజిలెన్స్ ఎస్ఐ రామారావు, సిబ్బంది ఈశ్వరరావు, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

స్థల వివాదంపై ఇరువర్గాల ఫిర్యాదు

ఇచ్ఛాపురం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధి స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయం ఎదురుగా ఉన్న ఖాళీగా ఉన్న స్థలం వివాదాస్పదంగా మారింది. ఈ స్థలం మాదంటే మాదని స్థానికులు, రియల్ వ్యాపారులు ఘర్షణ పడి ఇరువర్గాలవారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆలయం ఎదురుగా గిలాయి వీధిలో నివాసం ఉంటున్న కొంతమందికి సంబంధించి వారి ఇళ్ల పెరటిలో ఉన్న నేలబావులను రియల్ వ్యాపారులు పూడ్చేందుకు సిద్ధమయ్యారు. ఆ బావులు మావని, వాటిని పూడ్చడం కుదరదని ఇంటి యజమానులు వారితో ఘర్షణ పడ్డారు. దీనిపై టౌన్ ఎస్ఐ ముకుందరావును వివరణ కోరగా.. తహసీల్దార్‌కు పంపించామని, పరిశీలించి నివేదిక ఇవ్వాలని కోరినట్టు తెలిపారు.

జాతీయస్థాయి గోకార్టింగ్ పోటీలు ప్రారంభం



గోకార్టింగ్ పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

కె.కొత్తూరు (టెక్కలి), మార్చి 5(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ స్థాయి గోకార్టింగ్ సీజన్-2 పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. హైదరాబాద్‌కు చెందిన డీప్‌లూప్ టెక్నాలజీ సీఈవో సూర్య ప్రకాష్ కుసుమంచి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆటోమొబైల్ రంగంలో నూతన సాంకేతిక ఆవిష్కరణలకు ఇటువంటి పోటీలు దోహదం చేస్తాయన్నారు. కేవలం పోటీ లకే పరిమితం కాకుండా ఆవిష్కరణలను ఉత్పత్తి వైపు తీసుకువెళ్లి పరిశ్రమ లను స్థాపించి వాణిజ్యవేత్తలుగా ఎదగాలన్నారు. ఐతమ్ ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి ఎల్ఎల్ నాయుడు, కోశాధికారి టంకాల నాగరాజు, డైరెక్టర్ ప్రొఫె సర్ వీవీ నాగేశ్వరరావు మాట్లాడుతూ.. జాతీయస్థాయి పోటీలను యాజ మాన్యం రెండోసారి నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో కన్వీనర్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఏఎస్ శ్రీనివాసరావు, కో-కన్వీనర్లు డీన్ డి.శ్రీ రాములు, ఈసీఈ హెచ్‌వోడీ వి.అశోక్ కుమార్, సీఎస్ఈ హెచ్‌వోడీ వై.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి



గాదె శ్రీనివాసులు నాయుడును అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నరసన్నపేట, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు అన్నారు. మంగళవారం రాత్రి స్థానిక పైడితల్లి ఆలయం వద్ద ఆయనకు ఉపాధ్యాయులు స్వాగతం పలికారు. తనను గెలిపించిన ఉపాధ్యాయుల రుణం తీర్చుకుంటానన్నారు. పీఆర్టీయూ, ఏపీటీఎఫ్, ఇతర ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు లక్ష్మణరావు, కేశవరావు, రమేష్ పాల్గొన్నారు.

ఈసీపై ఫిర్యాదు

జలుమూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న ఈసీ సోమేశ్వరరావు తనపై దౌర్జన్యం చేసి మెడపై చేయవేసి తోసేశారని జలుమూరు సాంకేతిక సహాయకుడు అల్లు పూర్ణచంద్రరావు పోలీసులకు, ఎంపీడీవో కె.అప్పలనాయుడుకు బుధవారం ఫిర్యాదు చేశాడు. ఫారం పాండ్ నిర్మాణాలపై మంగళవారం ఉపాధి కార్యాలయంలో నిర్వహిం చిన టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్ల సమావేశంలో ఈసీ దౌర్జన్యంగా వ్యవహరిం చారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈసీపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. దీనిపై ఎంపీడీవో అప్పలనాయుడును వివరణ కోరగా ఇరువురి వద్ద వివరాలు సేకరించామన్నారు. ఏం జరిగిందనే దానిపై ఆరా తీస్తున్నామన్నారు.

బడిరుణం తీర్చుకున్న పూర్వ విద్యార్థి

సంతబొమ్మాళి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): దండుగోపాలపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థి, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఇచ్ఛాపురం నరేష్ కొళాయి సదుపాయం కల్పించి బడిరుణం తీర్చుకున్నాడు. సుమారు రూ.25 వేల వ్యయంతో తరగతి గదుల వద్ద తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటు చేసి బుధవారం ప్రారంభించారు. ఆయనను హెచ్ఎం కోత చైతన్య అభినందించారు. వాయుపుత్ర యూత్ అధ్యక్షుడు అట్టాడ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జాతి వైరం మరిచి..

● పిల్లికి పాలిచ్చిన కుక్క



పిల్లికి పాలిస్తున్న కుక్క

వజ్రపుకొత్తూరు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): బద్ధశత్రువులైన జంతువులు కొన్నిసార్లు చెట్టాపట్టా లేసుకుని తిరగడం చూస్తుంటాం. పిల్లితో స్నేహంగా ఉండే కుక్కను, ఎలుకతో కలిసిపోయే పిల్లిని.. ఇలా అనేక రకాల జంతువులను చూసినపుడు ఆశ్చర్యం కలుగుతుంది. ఇలాంటి ఘటనే వజ్రపు కొత్తూరు మండలంలో బుధవారం చోటుచేసుకుంది. సాధారణంగా పిల్లిని చూడగానే కుక్క వేటాడుతుంది. కానీ, గురుడుభద్ర జంక్షన్‌లోని ఓ ఇంటి వద్ద జాతి వైరం మరిచి ఓ కుక్క ఓ పిల్ల మార్జాలానికి పాలు ఇచ్చింది. ఈ దృశ్యాన్ని 'ఆంధ్రజ్యోతి' క్లిక్ మనిపించింది.

ప్రభుత్వ వైద్యంపై రోగులకు నమ్మకం కలిగించండి

● సీతంపేట ఐటీడీఏ పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి



చిన్నకోష్టలో విద్యార్థినులు, ఉపాధ్యాయులతో పీవో యశ్వంత్‌కుమార్ రెడ్డి

నందిగాం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించడం ద్వారా వారిలో నమ్మకం కలిగిం చాలని సీతంపేట ఐటీడీఏ పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం నందిగాం, నౌగాం పీహెచ్‌సీలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా పీహెచ్‌సీల్లో ఓపీ సేవలు, రికార్డులు, ఫార్మసీ, వ్యాక్సినేషన్, ల్యాబ్‌ను నిశితంగా పరిశీలించారు. సిబ్బంది సమయపాలన పాటించి రోగులకు అందు బాటులో ఉండాలన్నారు. వైద్య సేవలపై సంతృప్తి కలిగించాలన్నారు. నందిగాం పీహెచ్‌సీలో ఇద్దరు స్టాఫ్‌నర్సులు లేరని వైద్యాధికారి కె.అనితకుమారి పీవో దృష్టికి తీసుకువెళ్లారు. నౌగాం పీహెచ్ సీకి ప్రహరీ నిర్మించాలని సిబ్బంది కోరారు. అనంతరం జయపురం గిరి జన ఆశ్రమ పాఠశాలను సందర్శించి పదో తరగతి విద్యార్థుల ప్రగతిని పరిశీలించి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు సుభాష్, ఈవో సూర్యనారాయణ, సీహెచ్‌వో దాతారాం తదిత రులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో ఆణిముత్యాలను వెలికితీయాలి

హరిపురం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): గిరిజన విద్యార్థుల్లో మెరికల్లాంటి ఆణిముత్యాలను వెలికి తీసే బాధ్యత ఉపాధ్యాయులదేనని సీతంపేట ఐటీడీఏ పీవో సి.యశ్వంత్ కుమార్ రెడ్డి అన్నారు. చిన్నకోష్ట, చీపి ఆశ్రమ పాఠశాలలను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులను పరిశీలించారు. గిరిజన విద్యార్థుల్లో అత్యంత ప్రతిభావంతులున్నారని వారిని ఉన్నత లక్ష్యాల వైపు నడిపించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యలో అట్టడుగున ఉన్న వారు పాస్ అయ్యేలా ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. అనంతరం సిరిపురం పీహెచ్‌సీని సందర్శించి వైద్యులతో మాట్లాడారు. రోగులకు వైద్యం అందిస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. రికార్డులను, రక్తపరీక్షల ల్యాబ్‌ను పరిశీలించి రోగులకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ప్రహరీ నిర్మాణానికి చర్యలు తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం తిరుపతిరావు, వైద్యులు సాయి, పృథ్వి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సిబ్బంది కొరతతో ఇక్కట్లు

● వీఆర్వోలు, సర్వేయర్ల పోస్టుల ఖాళీ
● భూ సమస్యలు పెండింగ్‌తో ఇబ్బందుల్లో రైతులు
● ఇదీ కొత్తూరు మండలంలోని తీరు

కొత్తూరు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామ సచివాలయాల్లో రెవెన్యూశాఖ పరంగా విధులు నిర్వహించే వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్ల పోస్టులు ఖాళీగా ఉండడంతో వివిధ సమస్యలపై వచ్చే రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా భూ సమస్యల పరిష్కారంలో వీరిపాత్ర కీలకం. అయితే సచివాలయాల వెళితే సిబ్బంది లేరంటూ సమాధానం వస్తోందని పలువురు వాపోతున్నారు. మండలంలోని పలు సచివాలయాల్లోని సిబ్బంది ఇటీవల బదిలీ కావడం, వారి స్థానాల్లో కొత్తవారు రాకపోవడంతో ఈ సమస్య ఉత్పన్నమైంది. సమస్యలను అధిగమించేందుకు పక్క సచివాలయాల నుంచి డెప్యుటేషన్ వేసేందుకు అధికారులు ప్రయత్నించినా ప్రయోజనం కనిపించడం లేదు. ఇలా డెప్యుటేషన్‌పై వచ్చిన వారికి అదనపు భారమే తప్ప సమస్యలు పరి ష్కారం కావడం లేదన్నది రైతుల నుంచి వినిపిస్తోంది. మండలంలో 8 రెవెన్యూ గ్రామాలకు వీఆర్వోలు, 6 సర్వేయర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిలో పోను టూరు, దిమిలి, బమ్మిడి, నివగాం, కర్లెమ్మ, బలద, గురండి, కురిగాం సచివాలయాలకు వీఆర్వోలు, అలాగే మెట్టూరు-3, గొట్టిపల్లి, ఓంద్రుజోల, నేరడి, మాతల, దిమిలి గ్రామ సచివాలయాలకు సర్వేయర్లు లేకపో వడంతో 14 రెవెన్యూ గ్రామాల్లో భూ సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదన్న వాదన లొస్తున్నా యి. కొత్తూరు మండలం భౌగోళికంగా ఎక్కువగా కొం డల ప్రాంతం కావడం, మైదాన ప్రాంతాల్లో భూము లకు అధిక ధరలు ఉండడంతో రోజురోజుకు భూ తగాదాలు పెరుగుతున్నాయి. వీటిని పరిష్కరిం చాల్సిన అధికారులు ఇన్‌చార్జిలను నియమించి కాలం నెట్టుకొస్తున్నా ప్రయోజనం కనిపించడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు. దీనిపై తహసీల్దార్ రవిచంద్రను వివరణ కోరగా మండలంలో వీఆర్వోలు, సర్వేయర్ల పోస్టులు ఖాళీ వాస్తవమని, దీంతో గడువులోగా భూ సమస్యలు పరి ష్కారం కావడం లేదన్నారు. ఖాళీలను భర్తీ చేయాలని కలెక్టర్ నివేదిక పంపామని, సమస్యలు అధిగమిం చేందుకు ఆయా గ్రామాల్లో ఇన్‌చార్జిలను నియమించామని ఆయన పేర్కొన్నారు.

ఉద్యోగ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచాలి



నిరసన తెలుపుతున్న ఎంఆర్‌సీ ఉద్యోగులు

సంతబొమ్మాళి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విరమణ వయసు 62 సంవత్సరాలకు పెంచాలని ఎంఆర్‌సీ సిబ్బంది డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం నిరసన చేపట్టారు. హెచ్ఆర్ పాలసీ, మినియం టైం స్కేల్ అమలు చేసేలా అసెంబ్లీలో ప్రకటన చేయాలని కోరారు. కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

బుచ్చిపేటలో వైద్యశిబిరం

నరసన్నపేట, మార్చి 5(ఆంధ్రజ్యోతి): బుచ్చిపేట గ్రామంలో బుధవారం మాకివలస వైద్య సిబ్బంది వైద్యశిబిరాన్ని నిర్వహించారు. గ్రామంలో విజృంభిస్తున్న జ్వరాలపై పత్రికల్లో కథనాలు రావడంతో వైద్యసిబ్బంది స్పందించారు. 35 మంది నుంచి రక్త నమునాలను సేకరించారు. అలాగే క్లోరినేషన్ చేపట్టారు. కార్యక్రమంలో డాక్టర్ శిరీష, ఏఎన్ఎంలు భవానీ, శారద తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో రక్తదానం..

నరసన్నపేట, మార్చి5(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం రక్తదానం శిబిరం నిర్వహించారు. యువత రక్త దానం చేసి అత్యవసర సమయాల్లో ప్రాణాలు కాపాడాలని వక్తలు కోరారు. రక్తదానం చేసిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు.

ఛత్తీస్‌గఢ్ తెలుగు మహాసభలకు పలాసవాసులు

పలాసరూరల్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం రాయపూర్ గుడియార్ మంగళ భవన్‌లో ఈ నెల 8, 9 తేదీల్లో జరగనున్న తెలుగు మహాసభలకు పలాసకు చెందిన కళాకా రులకు ఆహ్వానం అందింది. 'మన తెలుగు జానపదాలు' అనే అంశంపై ఏపీ జానపద కళాకారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కుమార్ నాయక్ మాట్లాడేందుకు అవకాశం వచ్చింది. అదే విధంగా కవితలు, ఇతర అంశాలపై జనజాగృతి గౌరవ వ్యవస్థాపకులు తెప్పల కృష్ణమూర్తి ప్రసంగించనున్నారు.

బాలలను చేర్చుకోవడం చట్టరీత్యా నేరం

కాశీబుగ్గ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): బాలలను పనిలో చేర్చుకోవడం చట్టరీత్యా నేరమని లేబర్ ఆఫీసర్ విజయ్‌కుమార్ అన్నారు. బుధవారం పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని షాపింగ్ మాల్స్, హోటళ్లు, కిరాణా దుకాణాలు, మెకానిక్ షాపులు, జీడి పరిశ్రమల్లో తనిఖీ చేశారు. ఎంఈవో సత్యం పాల్గొన్నారు.

నిబంధనలకు వ్యతిరేకంగా ఆశీలు వసూలు

నరసన్నపేట, మార్చి 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన చట్టం మేరకు రవాణా వాహనాలకు ఎటువంటి ఆశీలు వసూలు చేసేందుకు వీలు లేదని, అయితే బుధవారం నరసన్నపేటలో బలవంతంగా వసూలు చేశారని న్యూ ఆంధ్ర మోటార్ ట్రాక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి శేషగిరి అన్నారు. ఈ విధానాన్ని సంఘం తీవ్రంగా ఖండిస్తోందన్నారు. నిబంధనలను అతిక్రమించి లారీ డ్రైవర్ల నుంచి దోపిడీకి పాల్పడుతున్నారని, దీనిపై పోలీసులు, పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేయనున్నామన్నారు. అసోసియేషన్ సభ్యులు పొట్నూరు చిన్న, ఉణ్న శ్రీధర్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై క్షేత్రస్థాయి పరిశీలన



వాటర్ ప్లాంట్ సిబ్బందితో మాట్లాడుతున్న అధికారులు

హిరమండలం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): హిరమండలంలో నీటి సమస్యకు ప్రధాన కారణం గొట్టా బ్యారేజి దిగువన ఉన్న ఓ ప్రైవేట్ వాటర్ ప్లాంట్ కారణమని స్థానికులు ఉన్నతాధికారులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ వెంకట అప్పలనాయుడు, జేఈ సాగర్, తహసీల్దార్ హను మంతరావు, ఎంపీడీవో కాళీప్రసాద్, ఈవోపీఆర్డీ గోవిందరావు బుధవారం క్షేత్రస్థాయిలో తనిఖీ చేపట్టారు. వాటర్ ప్లాంట్ యాజమాన్యం నిబంధనలకు విరుద్ధంగా అదనంగా బోరు తవ్వి వంశధార నదిలోని నీటిని తోడేస్తున్నారని, దీనివల్ల భూగర్భ జలాలు అడుగంటి రక్షిత నీటి పథకానికి నీరందడం లేదని, దీంతో తాము తాగునీటికి అల్లాడుతున్నామని స్థానికులు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో అధికారులు ప్లాంట్ మొత్తం పరిశీలించారు. చుట్టుపక్కల ఆరు బోర్లు ఉన్నట్లు గుర్తించారు. ప్లాంట్ అనుమతుల రికార్డులు తమకు అందజేయాలని తహసీల్దార్ ఆదేశించారు. రక్షిత నీటి పథకం బావిలో నీరు అందకపోవడంతో వేసవి ప్రాంభంలోనే తాగు నీటి సమస్య నెలకొందని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ చెప్పారు. స్వచ్ఛందంగా స్పందించి ట్యాంకుల ద్వారా నీటిని అందించాలని ప్లాంట్ యాజమాన్యానికి ఆదేశించారు. తాగునీటి సమస్య పరిష్కారమయ్యేవరకు నీటి సరఫరాకు సహకరించాలని ప్లాంట్ యాజమాన్యానికి అధికారులు సూచించారు.

రేపటి నుంచి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు



ప్రారంభానికి సిద్ధమైన ఆలయం

నందిగాం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): నరేంద్రపురంలో నూతనంగా నిర్మాణమైన రెయ్యిబోడమ్మ తల్లి, భూలోకమాత తల్లి అమ్మవారి ఆలయాల ప్రారంభం, విగ్ర హాల ప్రతిష్ఠోత్సవాలు శుక్రవారం నుంచి మూడురోజుల పాటు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామస్థుల ఆధ్వ ర్యంలో తొలిరోజు విఘ్నేశ్వరపూజ, గోపూజ, యాగశాల ప్రవేశం, అగ్ని ప్రతిష్ఠాపన, మండపార్చనలు, సాయంత్రం అమ్మవార్ల విగ్రహాల గ్రామ ప్రదక్షిణ నిర్వహిస్తున్నా మన్నారు. శనివారం మహిళలతో సామూహిక కుంకుమార్చనలు, సాయంత్రం చండీ సప్తశతి హోమం, నామ సంకీర్తన జరుగుతాయన్నారు. ఆదివారం విగ్రహ, యంత్ర, శిఖర ప్రాణప్రతిష్ఠతో పాటు జయాది హోమం, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు చేపడుతు న్నామన్నారు. ఆదివారం మధ్యాహ్నం మహా అన్నప్రసాద వితరణ, సంగీత నాద నీరాజనం, రాత్రికి కూచిపూడి, భరత నాట్య ప్రదర్శనలు ఏర్పాటు చేశామన్నారు. భక్తులు పాల్గొని అమ్మవార్లను దర్శించుకోవాలని కోరారు.

విజయ గణపతికి పెన్నులతో అలంకరణ



పెన్నులతో అలంకరణ చేసిన దృశ్యం

నరసన్నపేట, మార్చి 5(ఆంధ్రజ్యోతి): స్థానిక తిరుమల వీధిలోని విజయగణపతికి బుధవారం 516 పెన్నులతో అర్చన చేసి అలంకరించారు. ఆ తరువాత ఆ పెన్నులను పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు అర్చకుడు భాస్కరభట్ల జగదీష్ పంపిణీ చేశారు.

వైభవంగా మురళీకృష్ణుని కల్యాణం



ఎల్ఎన్‌పేట: శ్రీవేంకటేశ్వర కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు



జలుమూరు: కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితుడు

జలుమూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): అబ్బాయిపేటలో కొలువు తీరిన మురళీకృష్ణ స్వామి కల్యాణం బుధవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఆలయ 46వ వార్షికోత్సవం సందర్భంగా ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నసంతర్పణ నిర్వహించారు. సాయంత్రం శ్రీమురళీకృష్ణ రుక్మిణి సహిత సత్యభామల ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఆసీనులను చేసి మంగళ వాయిద్యాలతో తిరువీధి చేపట్టారు. రాత్రి స్వామివారి కల్యాణం శ్రీకూర్మం పండితులు చామర్తి సీతారామాచార్యులు ఆధ్వర్యంలో అర్చకుడు దివాకర్ శాస్త్రోక్తంగా నిర్వహించారు. పలువురు భక్తులు పాల్గొన్నారు.

తురకపేటలో వేంకటేశ్వర స్వామికి..

ఎల్.ఎన్.పేట, మార్చి 5(ఆంధ్రజ్యోతి): తురకపేట జంక్షన్ (శ్రీనివాసనగర్)లోని శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో పురోహితుడు మొజ్జాడ కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో బుధవారం స్వామి కల్యా ణం ఘనంగా నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను అలంకరించి వేద మంత్రాల నడుమ కల్యాణం కనులపండువగా చేపట్టారు. పలువురు భక్తులు కల్యాణోత్సవాన్ని తిలకించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. మధ్యాహ్నం అన్నసంతర్పణ చేశారు. కార్యక్రమంలో పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ఐటీడీఏ ప్రకటనపై హర్షం

మెళియాపుట్టి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మెళియాపుట్టిలో ఐటీడీఏ ఏర్పాటు చేస్తున్నట్లు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అసెంబ్లీలో ప్రకటించడం హర్షణీయమని మాజీ ఎంపీపీ, గిరిజన సంఘం నాయకుడు బైరిశింగి లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు ఇప్పటి సీఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు ఐటీడీఏన ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించడం ఆనందంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వంతోనే గిరిజన సంక్షేమం సాధ్యమన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘం మహిళా అధ్యక్షురాలు బి.ధరణి, సతీష్, కామేశ్వరావు, కూర్మారావు తదితరులు ఉన్నారు.

పాఠశాలకు ప్రహరీ నిర్మించండి

మెళియాపుట్టి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మెళియాపుట్టి జడ్పీ పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని తగు చర్యలు తీసుకోవాలని పాఠశాల తల్లిదండ్రుల కమిటీ అధ్యక్షుడు చిన్నబాబు కోరారు. ఈ మేరకు బుధవారం ఎంపీడీవో ప్రసాద్‌పండాకు వినతిపత్రం అందజేశారు. గతంలో నిధులు వచ్చినా తీర్మానం ఇవ్వకపోవడంతో వెనక్కు వెళ్లిపోయాయన్నారు. ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు.

రూ.20 లక్షల పరిహారం ఇవ్వాలి

కోటబొమ్మాళి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): చిన్నబమ్మిడి గ్రామంలోని మోడ్రన్ రైస్ మిల్లులో మంగళవారం జరిగిన ప్రమాదంలో మృతి చెందిన గొండు రాజారావు కుటుంబానికి రూ.20 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని సీఐటీయూ కార్యదర్శి హనుమంతు ఈశ్వరరావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశా రు. మృతుడికి రావాల్సిన బీమా, ఇతర ప్రభుత్వ పథకాలు వర్తింపు చేయాలన్నారు. మిల్లులో ప్రమా దాలు జరుగుతున్నా యాజమాన్యాలు, ప్రభుత్వం కనీస చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్పందించి కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయం కల్పించాలని కోరారు.

జాతీయ స్థాయి వెబినార్

టెక్కలి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఐక్యూ, ఫిజిక్స్ విభాగం ఆధ్వర్యంలో ఒకరోజు జాతీయ స్థాయి వెబినార్‌ను బుధవారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ టి.గోవిం దమ్మ మాట్లాడారు. సహాయ ప్రొఫెసర్ ఉమా దాస్, గొల్లపల్లి శ్రీపతి, శరణ్య రీసోర్స్ పర్సన్లుగా వ్యవహరించారు. మిషన్ లెర్నింగ్, క్వాంటమ్ ప్రచార వ్యవస్థలను వివరించారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ సతీష్, లూక్‌పాల్ పాల్గొన్నారు.

ఎల్లమ్మ జాతర రేపు

హిరమండలం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): హిరమండలం పెరికివీధిలోని సిర్లు పోతన్న ఎల్లమ్మతల్లి జామి యాత్రను శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సాయంత్రం సిరిమానోత్సవం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా అనేక వినోద, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

చెత్త నుంచి సంపద కేంద్రాలను నిర్మించాలి

జలుమూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): అన్ని పంచాయతీల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను నిర్మించాలని ఎంపీడీవో కె.అప్పలనాయుడు తెలిపారు. నగిరికటకం, కొమనాపల్లి గ్రామ సచివాలయాలను బుధవారం సందర్శించారు. మండలంలో 7 పంచాయతీల్లో చెత్త నుంచి సంపద కేంద్రాలు లేవన్నారు. ఈవోపీఆర్డీ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి సాయం

నరసన్నపేట, మార్చి 5(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన మేజీషియన్ పండిత సత్యానా రాయణ ఇటీవల గుండెపోటుతో మృతిచెందడంతో ఆయన కుటుంబానికి కళాకారులు రూ. 72,600 నగదును బుధవారం అందించారు. ఆయన కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న తోటి కళాకారులు, ఈవెంట్ మేనేజర్లు ఈ మొత్తం అందించి భరోసా కల్పించారు.